# ధన్వాడలో కాంగ్రెస్ ఖాళీ!



మంథని: పార్టీలో చేరిన విలోచవరం యువకులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

- పార్టీని వీడుతున్న సీనియర్ నేతలు
- గులాబీ పార్టీలో చేరికలు

మంథని, నవంబర్ 13: మంథని కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంతగ్రామమైన కాటారం మండలం ధన్వాడలో కాంగ్రెస్ ఖాళీ అవుతున్నది. ఆయన వైఖరి నచ్చని సీనియర్ నాయకులు ఒక్కొక్కరూ పార్టీని వీడుతున్నారు. మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకుంటున్నారు. గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తొంబర్ల వెంకటరమణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో చేరిన విషయం విదితమే. తాజాగా ధన్వాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జంగిలి సురేశ్, సుతారి సతీశ్, వీరగోని పవన్, అదే గ్రామ పంచాయతీ పరిధిలోని కొండంపేటకు చెందిన ఏనుగు సమ్మయ్య, శనిగారం సత్యంరాజ్, శ్రీధర్ బీఆర్ఎస్‌లో చేరారు. ముత్తారం మండలం సీతంపేట గ్రామంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమం అనంతరం వీరంతా గులాబీ పార్టీలోకి వచ్చారు. వీరికి పుట్ట మధూకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సొంత గ్రామం నుంచే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూరమవుతుండటం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారుతుంది.

**బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు..**

పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, మల్హర్, కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, పల్మెల మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, యువకులు, మహిళలు బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటిస్తున్నారు. తాజాగా మంథని మండలం విలోచవరం గ్రామానికి చెందిన 30 మంది యువకులు, మహదేవపూర్ మండలం ఎడపల్లికి చెందిన 30 మంది, రామగిరి మండలం సెంటనరికాలనీకి చెందిన 30 మంది, మంథని మండలం స్వర్ణపల్లికి చెందిన 50మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాగెపల్లికి చెందిన 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, అడవి సోమన్‌పల్లి 15 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన 25 యువకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వీరందరికీ పుట్ట మధూకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మధూకర్ మాట్లాడుతూ.. పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్త, నాయకుడు బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు.

**మహిళా విభాగం ప్రచార కార్యదర్శిగా భాగ్యలక్ష్మి**

బీఆర్ఎస్ మహిళా విభాగం మంథని మండల ప్రచార కార్యదర్శిగా పుప్పాల భాగ్యలక్ష్మి తిరుపతిని నియమిస్తున్నట్లు నియోజక వర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మంథనిలోని రాజగృహలో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజతో కలిసి ఆయన నియామక పత్రం అందజేశారు. ఇక్కడ మహిళా విభాగం నాయకురాళ్లు ఉన్నారు.

**ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తా**

ముత్తారం, నవంబర్ 13: మంథని నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని పుట్ట మధూకర్ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఐదేండ్లు మీ కష్టాల్లో అండగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని దర్యాపూర్, హరిపురం, పోతారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ తనను గెలిపిస్తే సీఎం సహకారంతో రూ. వెయ్యికోట్లతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఏసీ గోదాం, మంథనిలో మినీ స్టేడియం, పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మిస్తానని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మితే నట్టేట మునగడం ఖాయమని హెచ్చరించారు. చేతు గుర్తుకు ఓటేస్తే సాగురంగం నీర్వీర్యమవుతుందని, 24 గంటల కరెంట్ మూడు గంటలు అవుతుందన్నారు. ప్రచారంలో భాగంగా రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 15 మంది కార్యకర్తలు జడ్పీటీసీ మాదర వేన శారదాకుమార్, పన్నూరు సర్పంచ్ అల్లం తిరుపతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి పుట్ట మధూకర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే దర్యాపూర్‌లో అనారోగ్యంతో మరణించిన చల్ల ఆగయ్య కుటుంబసభ్యులను పుట్ట మధూకర్ పరామర్శించారు. అలాగే శస్త్రచికిత్స చేయించుకున్న గ్రామానికి చెందిన దొడ్ల కిషన్‌ను పరామర్శించారు. జడ్పీటీసీ చెల్కల స్వర్ణలత భర్త ,పోతారం మాజీ సర్పంచ్ చెల్కల అశోక్ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండ లాధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, పీఏసీఎస్ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ అత్తే చంద్రమౌళి, వైస్ ఎంపీపీ సుధాడి రవీందర్‌రావు, మహిలా అధ్యక్షురాలు పప్పు స్వరూప, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్, ఎంపీటీసీలు రామగల్ల పోసాని, బియ్యని శ్యామల సదానందం, సర్పంచులు గాదం స్రవంతీ శ్రీనివాస్, వేల్పూరి సంపత్‌రావు, నెత్తెట్ల మహేందర్, ఏఎంసీ డైరెక్టర్లు పప్పు చంద్రమౌళి, ఒడ్నాల రాజు, బేద సంపత్, మండల అధికార ప్రతినిధి తిత్తుల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు కొంకటి మల్లయ్య, సీనియర్ నేత మెంగాని తిరుపతి పాల్గొన్నారు.



ముత్తారం : ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్



రామగిరి : మద్దతు తెలిపిన హమాలీ కార్మికులతో బీఆర్ఎస్ నేతలు

## పుట్ట మధూకర్‌ను గెలిపించుకుందాం

రామగిరి నవంబర్ 13 : సమష్టి కృషితో మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్‌ను గెలిపించుకుందామని ఆ పార్టీ మండలాధ్యక్షుడు శంకేసి రవీందర్ అన్నారు. సోమవారం బేగంపేటలోని బీఆర్ఎస్ గ్రామ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మ్యాదరవేన కుమార్ యాదవ్, సీనియర్ నాయకుడు పీవీ.రావుతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి విజయబావుట ఎగరవేయాలని కార్యకర్తలకు దిశ నిర్ధేశం చేశారు. అనంతరం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలంలో పని చేస్తున్న బేగంపేట గ్రామ హమాలీ కార్మికులు బీఆర్ఎస్‌కు తమ మద్దతు ప్రకటించగా వారికి పార్టీ కండువాలు కప్పి టీ షర్ట్‌లు అందజేశారు. ఈ సమావేశంలో గ్రామ బీఆర్ఎస్ నాయకులు బుర్ర శంకర్ గౌడ్, మారగోని కుమారస్వామి, రాచకొండ లక్ష్మణ్, లక్కార్తీ మల్లయ్య, గోగుల మహేందర్, రంగం మధు, కొమ్ము నాగేశ్వర్, గోవిందుల రాజవీర్, రాజేందర్, కుంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**అరవై గ్యారంటీలు ఇచ్చినా కాంగ్రెస్‌ను నమ్మరు**

రామగిరి నవంబర్ 13 : కాంగ్రెస్ మరో అవై గ్యారంటీలు ఇచ్చిన ప్రజలు నమ్మే పరిస్థితి లేరని లద్నాపూర్ సర్పంచ్ బడికెల విజయ శ్రీనివాస్, ఎంపీటీసీ మెడగోని ఉమా రాజన్న అన్నారు. సోమవారం వారు గ్రామంలో గడప గడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రజా మేనిఫెస్టోను వివరిస్తూ రాబోయే కాలంలో మంథని నియోజకవర్గంలో మన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పుట్ట మధూకర్ లద్నాపూర్ గ్రామానికి ఏం పనులు చేశాడో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మల అశోక్, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి బర్ల కుమార్ నాయకులు కాపరబోయిన భాస్కర్,రొడ్డ శ్రీనివాస్, నారమల్ల రాయమల్లు,డేగ శ్రీనివాస్,చిప్ప సతీష్,చిన్నపెల్లి వెంకటేష్,డేగ శేఖర్,రామిండ్ల లింగయ్య,డేగ సది,డేగ రాములు,టౌట రాజబాపు, మెరుగు నరేశ్ పాల్గొన్నారు

**బీఆర్ఎస్‌వై నాయకుల ప్రచారం**

మంథని, నవంబర్ 13: పట్టణంలోని గోదావరి రహదారి వెంట ఏర్పాటు చేసిన పటాకుల విక్రయ దుకాణాల వద్ద బీఆర్ఎస్ యూత్ నాయకులు పుట్ట మధు తరపున ఎన్నికల ప్రచారం చేశారు. పటాకుల కొనుగోలు కోసం వచ్చిన ప్రజలకు, దీపావళి పండుగ సందర్భంగా గోదావరికి పుణ్యస్నానాలకు వెళ్లి వచ్చే భక్తులను బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, పుట్ట మధూకర్ ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సముద్రాల శ్రీనివాస్, యూత్ నాయకులు కొట్టే రమేష్, కొండ రవీందర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు



మంథని: షాపుల వద్ద ప్లకార్డులతో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్‌వై నాయకులు

## ప్రమాణాలు పాటిస్తేనే 'మద్దతు'

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ • కొనుగోలు కేంద్రాల సందర్శన

కాల్వశ్రీరాంపూర్, నవంబర్13: రైతులు నిర్దేశిత ప్రమాణాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందాలని పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. సోమవారం మల్యాలలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వసతుల కల్పనపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 305 సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సెంటర్ల నిర్వాహకులు వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. అవసరం మేరకు వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం విక్రయానికి వచ్చే రైతులు తమ వెంట ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌ను తెచ్చుకోవాలన్నారు. సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఏవో నాగార్జున, పీఏసీఎస్ సీఈవో కోలేటి శ్రీనివాస్, ఆర్ఐ నర్సింగం, ఏఈవో పూర్ణచందర్ ఉన్నారు.

## వైభవంగా ధనలక్ష్మి పూజలు

మంథని, నవంబర్13: దీపావళి పండుగను పురస్కరించుకొని మంథని శ్రీమహాలక్ష్మి ఆలయంలో ఆదివారం ధనలక్ష్మి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి మారుపాక ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేశారు. ఉత్సవ మూర్తులతో పాటు గర్భాలయంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారుపాక చంద్రకళ-రమేష్, డైరెక్టర్ పోతరాజు వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు

## దంపతుల ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

రామగిరి, నవంబర్ 13: తరచుగా మద్యం తాగి ఇంటికి వస్తున్న భర్తను చూసి మనస్తాపంతో ఓ భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, ఆ సంఘటన చూసి కలత చెందిన భర్త కూడా అదే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారకర సంఘటన సోమవారం రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో కలకలం రేపింది. రామగిరి ఎస్ఐ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి ఎందిన ఉప్పులూరి వీర్రాజు, రాఘువమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉండగా వారికి వివాహాలు జరిపించారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన వీర్రాజు సోమవారం ఉదయం 7 గంటలకే బయటకు వెళ్లి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో కోపోద్రిక్తురాలైన రాఘువమ్మ భర్తతో గొడవపడింది. ఎన్నిసార్లు చెప్పినా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో కలత చెందిన రాఘువమ్మ ఇంట్లోని పురుగుల మందు తాగింది. ఇది గమనించిన భర్త వీర్రాజు కూడా అదే మందు తాగాడు. ఇద్దరు అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. ఇంటి పక్కనే ఉన్న ఉప్పులూరి శ్రీనివాస్ ఆ దంపతులను హుటాహుటినా పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమద్యంలో రాఘువమ్మ చనిపోయింది. భర్త పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. కుమార్తె లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి ప్రసాద్ తెలిపారు.